# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు వేవ్స్ 2025 ఒక వేదికగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పంపిణీ చేశారు.**
3. **ఉపాధి శ్రామికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.**
4. **రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీలో క్రీడాకారులకు 3 శాతం క్రీడా కోటా వర్తింపజేస్తున్నామని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.**
5. **వేసవి సెలవుల దృష్ట్యా తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి ఈరోజు నుంచి పరిమితం చేసింది.**

==========================

భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న వరల్డ్ ఆడియో విజువల్ & ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ –వేవ్స్ 2025ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుదత్, పి. భానుమతి, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, సలీల్ చౌదరి వంటి 5 గురు భారతీయ చలన చిత్ర ప్రముఖుల తపాలా స్టాంపులను విడుదల చేశారు. “కనెక్టింగ్ క్రియేటర్స్, కనెక్టింగ్ కంట్రీస్” అనే ఇతివృత్తంతో నాలుగు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, వేవ్స్ క్రియేటివ్ రంగంలో అవకాశాలకు దోహదం చేస్తుందని అన్నారు ఒటిటి , గేమింగ్,, డిజిటల్ మీడియా, కృత్రిమ మేధ లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ఈ సదస్సు ఒక వేదికగా నిలుస్తుందని నరేంద్రమోదీ పేర్కొంటూ,

వాయిస్ ..40 సెకన్లు

--------------------------

అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను పున:ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సుమారు 58 వేల కోట్ల రూపాయలతో పలు ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో సచివాలయం వెనుక ఏర్పాటు చేసిన అమరావతి పైలాన్ ను ఆవిష్కరించనున్నారు. వీటితో పాటు దృశ్యమాధ్యమ విధానంలో కృష్ణాజిల్లా

నాగాయలంకలోని క్షిపణి పరీక్ష కేంద్రానికి కూడా శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం గుంటూరు–గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా కాజీపేట–విజయవాడ 3వ లైన్ కు ప్రధాన మంత్రి ప్రారంభోత్సవం చేయనున్నారు.

మరోవైపు ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రుల కమిటీ ఈరోజు సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు పి.నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లు, భద్రత, ప్రజలకు కల్పించే సౌకర్యాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు పాలెం వద్ద ఉన్న ఎస్.టి. కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు పింఛను నగదును అందజేశారు. అనంతరం ఈరోజు మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. తర్వాత నారంపేటకు చేరుకుని ఎం.ఎస్.ఎం.ఈ పార్కుకు శంకుస్థాపన చేస్తారు. అక్కడ నుంచి ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు.

---------------------------

ఉపాధి శ్రామికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. కార్మిక దినోత్సవం–మేడే సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉపాధి శ్రామికులతో ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ,

వాయిస్..29.. సెకన్లు

---------------------------

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాలో వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని బనగానపల్లెలో వరి, జొన్న పంటకు ఎక్కువ నష్టం జరిగిందని తెలిపారు. పంట నష్టంపై త్వరితగతిన నివేదికలు అందించాలని అధికారులనుమంత్రి ఆదేశించారు.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈరోజు ఆ పార్టీకి సంబంధించిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశమైయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈరోజు కాకినాడ జిల్లా పిఠాపురం, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, శ్రీ సత్య సాయి జిల్లా కదిరి, గాండ్లపెంట చిత్తూరు జిల్లాలోని కుప్పం, రామకుప్పం ప్రతి నిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ అంశాలపై చర్చించడంతో పాటు, పార్టీ బలోపేతం దిశగా తీసుకోవాల్సిన చర్యల గురించి జగన్మోహన్ రెడ్డి పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

దేశ వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన జరగనున్న నీట్‌యూజీ పరీక్షకు జాతీయ పరీక్ష సంస్థ ఎన్‌టీఏ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా పరీక్షల అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ కోసం అందుబాటులో ఉంచింది. విద్యార్థులు

తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ నమోదు చేసి అడ్మిట్ కార్డుల్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. కాగా ఈ నెల 4న దేశ వ్యాప్తంగా వివిధ పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష జరగనుంది.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీలో క్రీడాకారులకు 3 శాతం క్రీడా కోటా వర్తింపజేస్తున్నామని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. విజయవాడలోని క్రీడా ప్రాధికారసంస్థ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మొత్తం 421 పోస్టులను క్రీడల కోటా ద్వారా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. స్పోర్ట్స్ కోటా కింద ఉపాధ్యాయ అభ్యర్థులు మే 2 నుంచి మే 31 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..33 సెకన్లు

---------------------------

వేసవి సెలవుల దృష్ట్యా తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలను తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి ఈరోజు నుంచి పరిమితం చేసింది. దర్శనాల సిఫార్సు లేఖల స్వీకరణను నిలిపివేసింది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. ఈరోజు నుంచి జూలై 15వ తేదీ వరకు ఈ నిర్ణయం అమలు కానుంది. అలాగే బ్రేక్ దర్శనం సమయాన్ని ఉదయం 6గంటలకు మార్పు చేశారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నామని టిటిడి అధికారులు తెలిపారు.

=====================